
నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్-నిర్మల్
5 | నిజామాబాద్ గురువారం 13 జూన్ 2024 | ADILABAD NIRMAL



మావల పాఠశాలలో అసంపూర్తిగా ఉన్న తరగతి గదుల నిర్మాణం



నిర్మల్ : పాఠశాలలో శుభ్రం చేయకుండా ఎక్కడికక్కడ వదిలేసిన చెత్తా చెదారం




భుక్తాపూర్ ప్రభుత్వ పాఠశాలలో అసంపూర్తిగా పనులు

# మోగిన సమస్యల గంట



## పాఠశాల పునఃప్రారంభం రోజే విద్యార్థుల అవస్థలు



ఉట్నూర్ రూరల్ : పెద్ద సుద్దగూడలో పాఠశాల వద్ద పని చేయని బోరు



నర్సాపూర్ (జి) ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న తాగునీటి ట్యాంకు పనులు..

- ప్రభుత్వ పాఠశాలల్లో అసంపూర్తిగా పనులు
- నిలిచిన 'మన ఊరు-మన బడి'..
- నత్తనడకన 'అమ్మ ఆదర్శ పాఠశాలల' పనులు
- కొన్ని చోట్ల అందని బ్రేక్ ఫాస్ట్, మధ్యాహ్న భోజనం
- పంపిణీ కాని యూనిఫామ్స్, పాఠ్యపుస్తకాలు
- పునఃప్రారంభం సందర్భంగా 'నమస్తే తెలంగాణ' విజిట్

ఆదిలాబాద్/నిర్మల్, జూన్ 12(నమస్తే తెలంగాణ) : ఎండాకాలం సెలవుల అనంతరం బుధవారం ప్రభుత్వ పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. ఈ రోజు 'నమస్తే తెలంగాణ' బడులను విజిట్ చేయగా ఆసక్తికర విషయాలు వెలుగు చూశాయి. విద్యార్థులు తక్కువ సంఖ్యలో హాజరు కాగా.. సమస్యలు స్వాగతం పలికాయి. ఆదిలాబాద్ జిల్లాలోని 678 ప్రభుత్వ పాఠశాలల్లో 67, 418 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. దుస్తుల పంపిణీ చివరి దశకు చేరుకోగా 63,920 మందికి అందజేశారు. పాఠ్య, నోటు పుస్తకాల పంపిణీ పూర్తిస్థాయిలో పంపిణీ కాలేదు. పలు పాఠశాల్లో 'మన ఊరు-మన బడి' పథకంలో భాగంగా చేపట్టిన నిర్మాణ పనులు అసంపూర్తిగా ఉన్నాయి. అమ్మ ఆదర్శ కమిటీల కింద 664 పాఠశాలలను ఎంపిక చేయగా 437 స్కూళ్లలో పనులు పూర్తయ్యాయి. నిర్మాణాలు మధ్యలో ఆగిపోవడంతో విద్యార్థులు కూర్చోవడానికి అవస్థలు పడుతున్నారు. జిల్లాలో 3,028 ఉపాధ్యాయుల పోస్టు లు ఉండగా 2,467 మంది విధు లు నిర్వహిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 516 టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కేసీఆర్ ప్రభుత్వం ప్రారంభించిన అల్పాహా రం నిలిచిపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు.

### నిర్మల్ జిల్లాలో..

నిర్మల్ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు అరకొర సౌకర్యాల మధ్య బుధవారం పునఃప్రారంభమయ్యాయి. పాఠశాలల పునఃప్రారంభం నాటికే అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ బుట్టదాఖలైంది. అన్ని పాఠశాలల్లో సీఎం బ్రేక్‌ఫాస్ట్ అందలేదు. మధ్యాహ్న భోజన సౌకర్యాన్ని కూడా సమకూర్చలేదు. అలాగే తాగునీరు, టాయిలెట్లు, విద్యుత్ వంటి సౌకర్యాలను విస్మరించారు. ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాల పథకం కింద మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయాలను కల్పిస్తామని ప్రకటించింది. వీటికి 25 శాతం నిధులను మాత్రమే విడుదల చేయడంతో పనులు నిలిచిపోయాయి. జిల్లా వ్యాప్తంగా 608 పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల పథకం కింద పనులను ప్రారంభించగా, ఇప్పటి వరకు దాదాపు 100 పాఠశాలల్లోనే పనులు పూర్తయినట్లు తెలుస్తున్నది. జిల్లాలోని 735 ప్రభుత్వ పాఠశాలలో దాదాపు 45 వేల మంది విద్యార్థులు చదువులు కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం అనేక ప్రభుత్వ పాఠశాలల్లోని సౌకర్యాలను చూసి విద్యార్థులు ప్రవేశాలు తీసుకునేందుకు కూడా వెనుకాడుతున్నట్లు విమర్శలున్నాయి.

### నిలిచిన అమ్మ ఆదర్శ పనులు

అమ్మ ఆదర్శ పాఠశాల పథకం కింద చేపట్టిన పనులు చాలా చోట్ల పెండింగ్‌లోనే ఉన్నట్లు క్షేత్రస్థాయి పరిశీలనలో తేలింది. ఎక్కడికి వెళ్లినా పనులు అసంపూర్తిగానే కనిపిస్తున్నాయి. 735 బడుల్లోని 608 పాఠశాలల్లో పనులు ప్రారంభించారు. వీటిలో ఇప్పటి వరకు దాదాపు 100 పాఠశాలల్లో మాత్రమే పనులు పూర్తిస్థాయిలో జరిగినట్లు తెలిసింది. మెజార్టీ పాఠశాలల్లో మరుగు దొడ్లు, కిచెన్ షెడ్లు, ప్రహరీ నిర్మాణం, ఫ్లోరింగ్, తాగునీటి వసతి పనులు పూర్తికాలేదన్న ఆరోపణలు ఉన్నాయి. కొన్ని చోట్ల పనులు చేసినప్పటికీ బిల్లులు కూడా చేతికి రావడం లేదని తెలుస్తున్నది. పనులు ప్రారంభమై మూడు నెలలు గడుస్తున్నా ఇంకా చాలా చోట్ల టాయిలెట్లు, ప్రహరీ పనులను ప్రారంభించకపోవడంతో ఈ సారి కూడా విద్యార్థులు ఆరు బయటనే అత్యవసరాలను తీర్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమం అమలుతో మరిన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. క్షేత్రస్థాయిలో అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే ఇలాంటి పరిస్థితికి దారి తీసిందన్న వాదనలున్నాయి.



మామడ : పూర్తి కాని పాఠశాల అదనపు గదులు



ఉట్నూర్ రూరల్ : నవోదయ నగర్ గ్రామంలో వాడకంలో లేని మరుగుదొడ్లు




ఉట్నూర్ రూరల్ : చిన్నసుద్దగూడ గ్రామంలో అస్తవ్యస్థంగా ఉన్న పాఠశాల

# సర్కారు బడుల్లోనే నాణ్యమైన విద్య



బడిబాట ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే జాదవ్ అనిల్

### బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్

నేరడిగొండ, జూన్ 12 : సర్కారు బడుల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతున్నదని, ప్రతి ఒక్కరు ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువుకోవాలని బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ సూచించారు. బుధవారం వడూర్ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో నిర్వహించిన బడిబాట కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యార్థులు చదువులో రాణించి తల్లిదండ్రులు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ముగ్గురు విద్యార్థులకు శాలువా కప్పి సన్మానించారు. ముందుగా పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫాంలు అందజేశారు. పాఠశాలలో ఇటీవల పూర్తయిన సింక్ నిర్మాణాన్ని ప్రారంభించారు. అనంతరం బడిబాటలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వీడీసీ చైర్మన్ ఏలేటి రవీందర్‌రెడ్డి, మండల విద్యాధికారి అన్‌రెడ్డి భూమరెడ్డి, నేరడిగొండ జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం పద్మ, నాయకులు దేవేందర్‌రెడ్డి, గాదె శంకర్, పాల శంకర్, నవీన్, రాములు, సురేందర్, ప్రతాప్‌సింగ్, మహిళ సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు వనజ, తహసీల్దార్ సంతోష్‌రెడ్డి, ఎంపీడీవో రాజ్‌వీర్, ఐకేపీ ఏపీయం ఉత్తం పాల్గొన్నారు.

#### జొన్నల డబ్బులు అందేలా చూడాలి : ఎమ్మెల్యే

ఇటీవల కొనుగోలు చేసిన జొన్నల డబ్బులను రైతులకు వెంటనే అందేలా చూడాలని కలెక్టర్ రాజర్షి షాను బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ కోరారు. బుధవారం జిల్లా కార్యాలయంలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. రైతులు జొన్నల డబ్బులు రాక ఇబ్బందులు పడుతున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అలాగే నియోజకవర్గంలో పలు సమస్యలను విన్నవించారు. పరిష్కారానికి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఇందులో నాయకులు తిరుమల్ గౌడ్, గాడ్గె సుభాష్, పాండు, గంగయ్య, రమేశ్, రమాకాంత్ పాల్గొన్నారు.

# ఐదేండ్ల పిల్లలను బడిలో చేర్పించాలి



విద్యార్థులకు దుస్తులు, ఉచిత పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్న కలెక్టర్ రాజర్షి షా, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



బడిబాట కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

- ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య
- బడిబాట కార్యక్రమంలో కలెక్టర్ రాజర్షి షా

ఇంద్రవెల్లి, జూన్ 12 : అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐదేండ్లు నిండిన పిల్లలను చేర్పించాలని, ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య అందుతున్నదని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీపీఎస్-2 పాఠశాలలో ఏర్పాటు చేసిన జయశంకర్ సార్ బడిబాట కార్యక్రమంలో కలెక్టర్ రాజర్షి షా, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పాల్గొన్నారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఉచిత పాఠ్యపుస్తకాలతోపాటు దుస్తులను కలెక్టర్ రాజర్షిషా, ఎమ్మెల్యే బొజ్జుపటేల్ విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జయశంకర్ సార్ బడిబాట కార్యక్రమాలు ఈ నెల 19వ తేదీ వరకు నిర్వహిస్తామన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి మెరుగైన విద్యను పొందాలన్నారు. మహిళా సంఘాల ద్వారా ప్రతి పాఠశాల ఆవరణలో కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేసి కూరగాయలను పండించాలన్నారు.

### ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు

-ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

ప్రభుత్వ పాఠశాలలను అద్భుతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని, అమ్మ ఆదర్శ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందిస్తున్నామని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యా వ్యవస్థను మెరుగుపర్చడానికి రాష్ట్ర ప్రభుత్వం స్కిల్ డెవలప్మెంట్ యూనివర్సిటీని త్వరలో ప్రారంభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పోటే శోభాబాయి, జడ్పీటీసీ ఆర్కా పుష్పలత, ఎంపీటీసీ జాదవ్ స్వర్ణలత, డీఆర్డీవో సాయన్న, ఆర్డీవో జీవకర్‌రెడ్డి, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో భాస్కర్, ఎంఈవో నారాయణ, గిర్దావర్ మెస్రం లక్ష్మణ్, ఏంపీవో జీవన్‌రెడ్డి, ఏవో అరుణ, ఏఈలు లింగన్న, భానుకుమార్, ఐకేపీ ఏపీఎం రామారావ్, ఈజీఎస్ ఏపీవో జాదవ్ శ్రీనివాస్, ఈవో సంజీవరావ్ పాల్గొన్నారు.

### విత్తనాల రసీదులు భద్రంగా ఉంచాలి

-కలెక్టర్ రాజర్షి షా

రైతులు విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసిన రసీదులను భద్రంగా ఉంచుకోవాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎరువులు, విత్తనాల దుకాణాన్ని తనిఖీ చేశారు. అన్ని రకాల విత్తనాలను అందుబాటులో ఉంచాలని వ్యాపారస్తులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు వ్యాపారస్తులు అందిస్తున్న రసీదులతోపాటు విత్తనాల ప్యాకెట్ల కవర్లను భద్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం మండలకేంద్రంలోని బుద్ధనగర్‌లో మిషన్ భగీరథ నీటితోపాటు నల్లాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

### మస్కాపూర్ బడి బాగుంది..

-కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

ఖానాపూర్ రూరల్, జూన్ 12 : మస్కాపూర్ ప్రభుత్వ పాఠశాల బాగుందని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన బడిబాట కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం విద్యారంగం అభివృద్ధికి అనేక కార్యక్రమాలు చేపడుతున్నదని పేర్కొన్నారు. అనంతరం అదే గ్రామంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో డీఈవో రవీందర్‌రెడ్డి, మండల స్పెషల్ ఆఫీసర్ రాంబాబు, ఎంఈవో జీ.మధుసుదన్, తహసీల్దార్ ఎం.శివరాజ్, ఎంపీడీవో సునీత, ఎంపీపీ అబ్దుల్ మోహిద్, వైస్ ఎంపీపీ వాల్ సింగ్, ఎంపీటీసీ పుప్పాల స్వప్న, హెచ్ఎం నరేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు జాడి శ్రీనివాస్, కుర్ర శేఖర్, నరేందర్, నాయకులు పుప్పాల గజేందర్, దయానంద్ పాల్గొన్నారు.

### ఇదేనా బడిబాట

నార్నూర్, జూన్ 12 : ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల సంఖ్యను పెంచాలని ప్రభుత్వం బడిబాట కార్యక్రమాన్ని అట్టహాసంగా ప్రారంభించింది. నార్నూర్, గాదిగూడ మండలాల్లోని మారుమూల గ్రామాల్లో బడిబాట కార్యక్రమం మొక్కుబడిగా సాగుతోంది. బుధవారం పాఠశాలలు పునఃప్రారంభం అయినప్పటికీ పిల్లలు పాఠశాలకు వెళ్లకుండా తల్లిదండ్రులతో పొలం బాట పట్టారు. మాన్కాపూర్ గ్రామ సమీపంలో భూమిని చదును చేస్తుండగా 'నమస్తే తెలంగాణ' తన కెమెరాలో బంధించింది.



మాన్కాపూర్ గ్రామ సమీపంలో భూమిని చదును చేస్తున్న బాలురు

### డబుల్ బెడ్రూంలను అందించాలి..

భైంసా, జూన్ 12 : భైంసా పట్టణంలో నిర్మించిన డబుల్ బెడ్రూంలలోకి లబ్ధిదారులు బుధవారం వెళ్లారు. బీడీలు చుట్టుకుంటూ అక్కడే ఉన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ.. గత కేసీఆర్ ప్రభుత్వం డబుల్ బెడ్రూంలను నిర్మించిందని, వాటిని కాంగ్రెస్ ప్రభుత్వం కేటాయించడం లేదని మండిపడ్డారు. త్వరగా అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని వారికి నచ్చజెప్పినా వినలేదు.



డబుల్ బెడ్రూంలలో నిద్రిస్తున్న లబ్ధిదారులు

### ఉపాధి కోసం వెళ్లి విగతజీవిగా..

#### ఉరివేసుకుని యువకుడి ఆత్మహత్య



గంగారాం (ఫైల్)

ఖానాపూర్ రూరల్, జూన్ 12 : ఆరు నెలల క్రితం ఉపాధి కోసం దుబాయి వెళ్లి ఆర్థిక ఇబ్బందులతో ఉరివేసుకుని గంగారం(30) అనే యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. పాత ఎల్లాపూర్‌కు చెందిన కుంచెపు గంగారాం-గంగవ్వల కుమారుడు గంగారాం గతేడాది నవంబరులో దుబాయ్ వెళ్లాడు. సప్లయ్ కంపనీ కావడంతో ఏజెంట్ మోసం చేశాడని గ్రహించాడు. పనులు లేక వేతనాలు సక్రమంగా ఇవ్వలేదు. ఏజెంట్ తప్పుడు మాటలు చెప్పి పంపించాడని ఇంట్లో వాళ్లకి తెలిపాడు. తినడానికి, ఖర్చులకు డబ్బులు లేక ఇబ్బందులు పడ్డాడు. ఆర్థిక ఇబ్బందులకు గురై మంగళవారం రాత్రి కంపెనీ క్యాంపు కార్యాలయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గంగారాంకు భార్య గంగామణి, ఇద్దరు కుమారులు చందు, గంగాధర్ ఉన్నారు.